
సాక్షి పశ్చిమగోదావరి

గురువారం : 18 : ఏప్రిల్ : 2024



వైఎస్సార్ సీపీ దూకుడు

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ దూసుకెళుతోంది. అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులూ ప్రచారం చేస్తూ ఆకట్టుకుంటున్నారు. 8లో ▸



నలుగురి అరెస్టు

జంగారెడ్డిగూడెంకు చెందిన నలుగురిపై పోలీసులు పీడీ యాక్ట్ అమలు చేశారు. వీరిని అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. 8లో ▸



25న గురుకుల పరీక్ష

ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 25న పరీక్ష నిర్వహించనున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

19న ముదునూరి ప్రసాదరాజు నామినేషన్



ముదునూరి ప్రసాదరాజు, చీఫ్ విప్

నరసాపురం: నరసాపురం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ముదునూరి ప్రసాదరాజు ఈనెల 19న శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 9 గంటలు నుంచి మొగల్తూరు మండలం పాతపాడు నుంచి వేలాది మంది పార్టీ కార్యకర్తలతో ర్యాలీగా వచ్చి నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారు. ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతూ ముందున్న ముదునూరి నామినేషన్ ప్రక్రియను ముగించుకుని ప్రచార కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేయాలని భావిస్తున్నారు. నామినేషన్ కార్యక్రమాన్ని భారీగా నిర్వహించడానికి పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు ఓపెన్ మైండ్స్ ఫర్ బెటర్ సొసైటీ సదస్సు

భీమవరం: భీమవరంలో గురువారం ఓపెన్ మైండ్స్ ఫర్ బెటర్ సొసైటీ సెమినార్ నిర్వహించనున్నట్టు ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ పి.సంజీవరావు తెలిపారు. పట్టణంలోని పీపీ రోడ్డులోని పీసీఆర్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 గంటలకు సెమినార్ ప్రారంభమవుతుందని, ఆంధ్రప్రదేశ్ నాడు–నేడు అనే అంశంపై ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ కమిషన్ అండ్ ఓపెన్ మైండ్స్ ప్రెసిడెంట్, మాజీ మెంబర్ సెక్రటరీ అండ్ సీఈఓ డాక్టర్ ఎన్.రాజశేఖర్‌రెడ్డి ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ అజేయ కల్లాం, మాజీ చీఫ్ ఆర్టీఐ కమిషనర్ పి.విజయబాబు, డీఎన్నార్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ ఎ.కృష్ణమోహన్, బీహెచ్ రామకృష్ణంరాజు, భీమవరం బ్రౌనింగ్ జూనియర్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేడిది జాన్సన్, కేజీఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్ హాజరవుతారని సంజీవరావు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య



భీమవరం: జిల్లాలో రైతుల నుంచి దాళ్వాలో ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడానికి పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. క్వింటాల్ ధర ఏ– గ్రేడ్ రూ.2,203, సాధారణ రకం రూ.2,183గా నిర్ణయించామన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోపు వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలుకు గోనె సంచులు, హమాలీలు, రవాణా వాహనాలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని, వీటిని రైతులే ఏర్పాటు చేసుకుంటే ఖర్చులను కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని సూచించారు. జిల్లా, డివిజన్, మండలం, గ్రామస్థాయిలో ధాన్యం సేకరణ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం సేకరణలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో పాటు సమస్యలు ఉత్పన్నం కాకుండా పూర్తిస్థాయిలో పర్యవేక్షణ ఉంటుందన్నారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోలు రూములు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని జేసీ తెలిపారు. అలాగే కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లో ఫోన్ 81216 76653 అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 306 రైతు భరోసా కేంద్రాల్లో ఇప్పటివరకు 125 ధాన్యం కొనుగోలు సహాయ కేంద్రాల ద్వారా రైతుల నుంచి 18,528 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. జిల్లాలో పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని, ధాన్యం కొనుగోలులో ఎటువంటి జాప్యానికి అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

సివిల్స్‌లో సత్తాచాటిన ఏపీ నిట్ విద్యార్థి



నవ్యశ్రీ

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం ఏపీ నిట్ పూర్వ విద్యార్థిని గోవాడ నవ్యశ్రీకి సివిల్స్‌లో జాతీయస్థాయిలో 995 ర్యాంకు సాధించారు. చిన్నప్పటి నుంచి చదువులో ముందుండే ఆమె సమాజ సేవ లక్ష్యంగా ముందుకు సాగారు. ఈ క్రమంలో నాలుగో ప్రయత్నంలో ఆమె సివిల్స్‌లో విజయం సాధించారు. ఆమె స్వస్థలం ప్రకాశం జిల్లా ఒంగోలు గ్రీన్ వ్యాలీ, తండ్రి ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ కాగా, తల్లి గృహిణి. ఈమె ఏపీపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి వైద్యారోగ్యశాఖలో అడ్మిన్ అధికారిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆమెను ఏపీ నిట్ ఇన్‌చార్జి డాక్టర్ బీఎస్ మూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి, వి.సందీప్, టి.రమేష్ తదితరులు అభినందించారు.

● జగమంతా.. రామమయం

సీతారాముల కల్యాణం.. చూసిన కనులదే భాగ్యం.. అన్నట్టుగా శ్రీరామనవమి వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. ఊరూవాడా సీతారాముల కల్యాణోత్సవాలతో సందడి నెలకొంది. ద్వారకాతిరుమల క్షేత్రంతో పాటు ప్రముఖ ఆలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు. రథోత్సవాలు, అన్నసమారాధనలు జరిగాయి.

– సాక్షి నెట్‌వర్క్



ద్వారకాతిరుమల : చిన వెంకన్న క్షేత్రంలో సీతారాముల కల్యాణ వేడుక



పెంటపాడు : కె.పెంటపాడు బైరాగి మఠంలో కల్యాణ తంతు



పెనుగొండ : వడలిలో రథం లాగుతున్న చిన్నారులు

ఫ్యాన్స్‌లో ఫుల్ జోష్



వైఎస్సార్‌సీపీలో నవోత్సాహం

- సీఎం జగన్ బస్సుయాత్ర సూపర్ సక్సెస్
- వెల్లువలా తరలివచ్చిన జనం
- మండుటెండను లెక్కచేయని వైనం
- జననేత కోసం ఎదురుచూసిన ఊళ్లు
- రెట్టించిన ఉత్సాహంలో పార్టీ శ్రేణులు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జన గోదావరిని తలపించింది. తమ అభిమాన నాయకుడిని చూసేందుకు మండుటెండను లెక్కచేయకుండా ఊళ్లకు ఊళ్లే రోడ్లపైకి వచ్చాయి. పొద్దుపోయినా వేచి ఉండి జన నీరాజనం పట్టాయి. జై జగన్ అంటూ నినదించాయి. యువత ప్రదర్శించిన ప్లకార్డులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. జిల్లాలో బస్సు యాత్ర, భీమవరం బహిరంగ సభ సూపర్ సక్సెస్ కావడం వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఫుల్‌జోష్ నింపగా, మరోపక్క కూటమి గుండెల్లో దడ పుట్టిస్తోంది.



వెల్లువెత్తిన అభిమానం.. తణుకు మండలం దువ్వ సెంటర్‌లో అభిమానుల కోలాహలం (ఫైల్)

సాక్షి, భీమవరం: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్ర 16వ రోజు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఉంగుటూరు, ఉండి, భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల మీదుగా సాగింది. ఈ దారిలో ముందురోజు నుంచే పండగ వాతావరణం కనిపించింది. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా ప్రజలు బస్సుయాత్ర సాగే రోడ్డుకు ఇరువైపులా బారులు తీరి జగన్ రాక కోసం ఎదురుచూడటం కనిపించింది. అడుగడుగునా బస్సు ఆపి చిన్నారులు, వృద్ధులు, మహిళలు అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. వారి బాగోగులు తెలుసుకుంటూ.. సీఎం జగన్ ముందుకు సాగారు.

వేయి కళ్లతో ఎదురుచూసి..

భీమవరం బహిరంగ సభ అనంతరం రాత్రి తేతలిలో రాత్రి బస క్యాంపునకు సీఎం జగన్ చేరుకున్నారు. రాత్రి 8 గంటలకు తేతలి వద్దకు చేరుకోవాల్సి ఉండగా వెల్లువెత్తిన జనప్రవాహంతో పర్యటన రెండు గంటల ఆలస్యంగా సాగింది. అయినా ఆయన రాక కోసం ఊళ్లకు ఊళ్లే రోడ్లపైకి వచ్చాయి. చిన్నా పెద్దా అంతా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లకు చేరుకుని జననేత కోసం వేయి కళ్లతో ఎదురుచూశారు. పలు కూడళ్ల వద్ద సీఎం జగన్ బస్సుపైకి చేరుకుని ప్రజలకు అభివాదం చేస్తూ వారిలో ఉత్సాహం నింపారు. జగన్ బాబు నన్ను పలకరించారని, ఆరోగ్యం జాగ్రత్తని చెప్పానని వృద్ధులు, జగనన్నతో సెల్ఫీ తీసుకున్నానంటూ యువతీ యువకులు, నాకు నుదుటన ముద్దుపెట్టారంటూ చిన్నారులు, సమస్యను ఆలకించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఫోన్ చేయమని నంబర్ ఇచ్చారంటూ అర్జీదారులు సంభ్రమాశ్చర్యాలకు గురికావడం దారిపొడవునా కనిపించింది.

గాయాన్ని చూసి చలించిన హృదయాలు

హత్యాయత్నం ఘటనలో సంక్షేమ సారథి నుదుటన అయిన గాయాన్ని చూసి చలించని హృదయం లేదు. జిల్లావాసులతో పాటు కర్నూలు, ఏలూరు, ప్రకాశం జిల్లాల నుంచి అభిమానులు తరలివచ్చి దారిలో ఆయన్ను పలకరించి వెళ్లారు. మా కోసం కష్టపడుతున్న మీకు ఎంత ఆపద వచ్చిందంటూ వృద్ధులు ఆవేదన చెందారు. ప్రజల ఆశీస్సులే కొండంత అండగా ఉంటాయని, దాడిచేసిన దుర్మార్గులకు దేవుడే తగిన శాస్తి చెస్తాడంటూ ధైర్యం చెప్పారు. గాయం త్వరగా నయం కావాలని వృద్ధులు, ఆరోగ్యం జాగ్రత్త అన్న అంటూ మహిళలు ఆప్యాయత చూపించారు.

వినూత్న ప్లకార్డులతో..

బస్సు యాత్రతో పాటు భీమవరం బహిరంగ సభలో అభివృద్ధి ప్రధాతపై వినూత్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ యువత తమ అభిమానాన్ని చాటుకున్నారు. సిద్ధం.. ఇకపై యుద్ధం, మ్యాన్ ఆఫ్ మాస్, ఏపీ కింగ్, రాజ్యం మాదే.. పాలన మాదే, కింగ్ ఆఫ్ ఆంధ్ర, పద్మవ్యూహంలో చిక్కుకుని వారి బాణాలకు బలైపోవడానికి ఇక్కడున్నది అభిమన్యుడు కాదు.. అర్జునుడు అంటూ యువత ప్రదర్శించిన ప్లకార్డుల చిత్రాలతో 'వెస్ట్‌గోదావరి ఫ్యానిజం అంటే మినిమం ఉంటాదంటూ' సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అయ్యాయి. కూటమి ఆశలపై నీళ్లు చల్లుతూ జిల్లాలో బస్సుయాత్ర విజయవంతం కావడం పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నింపింది. సీఎం జగన్ బస్సు యాత్ర, బహిరంగ సభ సూపర్ సక్సెస్ కావడంతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకుల్లో వణుకు పుట్టింది.

నేడు తణుకులో పర్యటన

మేమంతా సిద్ధం బస్సు యాత్ర బుధవారం తణుకు నియోజకవర్గంలో జరుగనుంది. ఉదయం 9 గంటలకు తేతలిలోని నైట్ హాల్ట్ క్యాంపు వద్ద నుంచి బయలుదేరి తణుకు క్రాస్ మీదుగా సీఎం జగన్ తూర్పుగోదావరి జిల్లాకు చేరుకుంటారు. నియోజకవర్గంలో యాత్ర విజయవంతానికి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉండిలో మూడు చక్రాల సైకిల్

అదండీ సంగతి

ఆకివీడు: ఆ నియోజకవర్గంలో మూడు చక్రాల సైకిల్ గమ్యం లేకుండా తిరుగుతోంది. మూడు చక్రాలూ ఎదురెదురుగా తిరుగుతుండటంతో ప్రయాణం ఒక్క అడుగూ ముందుకు సాగని పరిస్థితి. ఆ మూడు చక్రాలకూ ముగ్గురు ప్రతినిధులుగా ఉన్నారు. ఒకరికి సీటు ఖరారవగా.. మరొకరు సీటివ్వలేదని రెబెల్‌గా పోటీ చేస్తానంటూ ప్రచారం చేసుకుంటున్నారు. మరొకరు ఎంపీ సీటును ఆశించి.. భంగపడి.. ఇప్పుడు అసెంబ్లీ సీటులో అయినా పోటీ చేయాలనే తలంపుతో ఇటు కన్నేసిన పరిస్థితి. ఇక సీటు ఖరారైన అభ్యర్థి పరిస్థితి మరీ దారుణంగా మారింది. పోటీకి సిద్ధమవుదామంటే.. సీటు దక్కక రెబెల్‌గా బరిలో దిగుతానంటూ వ్యతిరేక ప్రచారం చేస్తున్న నాయకుడు ఒక పక్క.. అసలు తన సీటుకే ఎసరు పెట్టేందుకు పావులు కదుపుతున్న మరో నేత ఇంకోపక్క.. నామినేషన్ల దశ కూడా మొదలైపోతున్న దశలో ఎటూ తేలని సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి. ఇదంతా ఉండి అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ దుస్థితి. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజుకు తొలి జాబితాలో సీటు దక్కగా.. అది తన నియోజకవర్గమని, గతంలో తాను త్యాగం చేసిన ఆ స్థానాన్ని తనకే ఇవ్వాలని పట్టుబట్టిన నేత శివరామరాజుకు నిరాశే ఎదురైంది. దీంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్న శివరామరాజు రెబెల్‌గా బరిలో దిగుతానంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఇక నరసాపురం ఎంపీ స్థానాన్ని ఆశించి తీవ్ర భంగపాటుకు గురైన కనుమూరి రఘురామకృష్ణరాజు.. ఉండి అసెంబ్లీ స్థానంలో అయినా పోటీ చేయాలని చంద్రబాబును ఒప్పించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్న పరిస్థితి. ఇప్పటివరకూ రెండు చక్రాలతోనే తలలు పట్టుకుంటున్న ఆ పార్టీ కేడర్‌కి.. కొద్దిరోజులుగా మూడు చక్రాల సైకిల్ మాదిరిగా పరిస్థితి మారడంతో ఎవరికి టికెట్ ఇస్తారో.. ఎవరి వెనుక తిరగాలో.. ఎవరు పోటీలో ఉంటారో అర్థంగాక అయోమయంలో ఉన్నారు. ఆయన (శివరామరాజు)కు ఈయన (మంతెన రామరాజు) వెన్నుపోటు.. ఈయన (మంతెన రామరాజు)కు ఆయన (శివరామరాజు) వెన్నుపోటు.. ఆయన (శివరామరాజు), ఈయన (మంతెన రామరాజు)కు అతని (రఘురామకృష్ణరాజు) వెన్నుపోటు.. అన్నట్టుగా పరిస్థితి నెలకొంది. వెన్నుపోటు పార్టీకి వెన్నుపోటు తప్పదని ప్రజలు గుసగుసలాడుకొంటున్నారు. అదండీ సంగతి!

బాబాయ్ అబ్బాయ్ కలిశారు.. ఇక చూడు నా రాజా..



మాట్లాడుకుంటున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని

తాడేపల్లిగూడెం : ఆ నేతలిద్దరూ రక్త సంబంధీకులు కారు.. కానీ వరుసకు బాబాయ్.. అబ్బాయ్. అంతేకాదు.. రాజకీయంగా ఇటీవల కాలం వరకు వారు ప్రత్యర్థులు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఒకరు వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి ఘన విజయం సాధించారు. మరొకరు తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసి కొద్ది తేడాలో పరాజయం పాలయ్యారు. ఇంతకీ ఈ ఇద్దరూ ఎవరో కాదు.. ఒకరు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, మరొకరు మాజీ ఎమ్మెల్యే ఈలి నాని. కొట్టు సత్యనారాయణకు ఈలి నాని వరుసకు బాబాయ్.. నానికి కొట్టు సత్యనారాయణ వరుసకు అబ్బాయ్ అవుతారు. అలాగే ఆత్మీయంగా పిలుచుకుంటారు. గత సార్వత్రిక ఎన్నికల తర్వాత టీడీపీకి దూరంగా ఉన్న ఈలి నాని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర సందర్భంగా నాని సీఎంను కలిశారు. కొట్టు సత్యనారాయణ, ఈలి నాని ఇద్దరూ నారాయణపురం నుంచి భీమవరం వరకు కలిసి ప్రయాణం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అభ్యర్థిగా కొట్టు సత్యనారాయణను సీఎం అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో ఆయన విజయానికి ఈలి నాని కూడా కృషి చేయనున్నారు. వీరిద్దరూ పెంటపాడు మండలం కస్పా పెంటపాడులోని బైరాగిమఠంలో బుధవారం జరిగిన శ్రీరామ నవమి కల్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. వీరిద్దరిని చూసినవారు 'బాబాయ్ అబ్బాయ్ కలిశారు.. ఇక చూడు నా రాజా.. రాజకీయం..' అంటున్నారు.

బీవీ రావు రాకతో మరింత ఉత్సాహం



సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నేత బీవీ రావు. చిత్రంలో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ, మంత్రి కారుమూరి, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

కైకలూరు: కైకలూరు జనసేన పార్టీ ఇన్‌చార్జిగా సేవలు అందించి సీటు కోసం ప్రయత్నించి భంగపడిన నియోజకవర్గ జనసేన నేత బుసనబోయిన వెంకటేశ్వరరావు (బీవీ రావు) వైఎస్సార్‌సీపీలో చేరారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణల ఆధ్వర్యంలో చేరిక జరిగింది. మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ ఆయనతో పాటు ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తానని బీవీ రావు అన్నారు.

పక్కాగా ఎన్నికల తనిఖీలు

ఉండి: ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు పక్కాగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. బుధవారం ఎంపీడీఓ ఎస్.రవీంద్రతో కలిసి ఆరేడు చెక్‌పోస్టు వద్ద తనిఖీలను పరిశీలించారు. నగదు, మద్యం, మాదక ద్రవ్యాల రవాణాను కట్టడి చేయాలన్నారు. ప్రతి తనిఖీ నమోదు చేయాలని జేసీ ఆదేశించారు.

రాములోరి సాక్షిగా ప్రత్యర్థుల కలయిక



వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి, మాజీ ఎమ్మెల్సీ అంగరను సత్కరించిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: రాజకీయంగా వారిద్దరూ వేర్వేరు పార్టీలకు చెందిన ప్రత్యర్థులు. సీతారాముల కల్యాణ వేదిక సాక్షిగా ఒకరికొకరు తారసపడి ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాలకొల్లులోని గుత్తులవారిపేట శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద బుధవారం నిర్వహించిన సీతారాముల కల్యాణంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. చేతులు కలిపి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని అంగరను గుడాల గోపి కోరడంతో అక్కడే ఉన్న వైఎస్సార్ సీపీ నాయకుడు అడబాల వెంకటరమణ జోక్యం చేసుకుని ఈసారి రామమోహన్ మనకే మద్దతిస్తారనడంతో అక్కడి ఉన్నవారంతా సరదాగా నవ్వుకున్నారు. అనంతరం వీరిని ఆలయ కమిటీ అధ్యక్షుడు జోగి వెంకటేశ్వరరావు సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

నామినేషన్లకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం
- కలెక్టర్ సుమిత్‌కుమార్



భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుంచి వారి ఖాతాలో ప్రచార ఖర్చు నమోదు చేస్తామని పేర్కొన్నారు. సభలు, సమావేశాలు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలు, జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు, వాహనాలు, ఏజెంట్లకు పెట్టే భోజనాల ఖర్చు సైతం అభ్యర్థి ఖాతా కిందకే వస్తాయని తెలిపారు. పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు ఇద్దరూ ఉమ్మడిగా సమావేశాలు, సభలు నిర్వహిస్తే ఆ ఖర్చును ఇద్దరికీ సర్దుబాటు చేస్తామన్నారు. జిల్లాకు ముగ్గురు అధికారులను వ్యయ పరిశీలకులుగా నియమించారని, ఒకరు పార్లమెంటుకు, మిగిలిన ఇద్దరు అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యతలు నిర్వర్తిస్తారన్నారు. త్వరలో వారు జిల్లాకు రానున్నారని, వారు వచ్చేలోపు అవసరమైన అన్ని రిజిస్టర్లను సిద్ధం చేసి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సభలు, సమావేశాలు జరిగిన 24 గంటల్లోపు అభ్యర్థి ఖాతాలో ఖర్చు నమోదు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించామన్నారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని నియోజకవర్గాల ఆర్వోల పరిధిలో ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ తెలిపారు.

కలెక్టరేట్‌లో ఆర్వో కార్యాలయం : పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఆర్వో కార్యాలయాన్ని భీమవరం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేశామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి నామినేషన్ వేసే అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.25 వేలు, అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్ వేసే అభ్యర్థులు రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉందన్నారు. ఎస్సీ రిజర్వు నియోజకవర్గాల్లో 50 శాతమే డిపాజిట్ ఉంటుందన్నారు. నామినేషన్ల దాఖలులో కోడ్ తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

నిబంధనలు పాటించాలి : నామినేషన్ స్వీకరణ గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులకు మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉందని, వాహనాలను ఆర్వో గదికి 100 మీటర్ల దూరంలో నిలిపి ఉంచాలన్నారు.

క్లుప్తంగా

తణుకు రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తణుకు: తణుకు రైల్వే స్టేషన్ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై పాత బుకింగ్ కార్యాలయం వద్ద సుమారు 30 నుంచి 35 ఏళ్లు వయసు కలిగిన వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు నీలం రంగు గళ్లచొక్కా, సిమెంట్ రంగు ప్యాంట్‌తోపాటు మంకీ క్యాప్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భీమవరం జీఆర్‌పీ ఎస్సై పీటీవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 70939 39777 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

ఆర్టీసీ బస్సులో బంగారం బ్యాగ్ మాయం

భీమవరం: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా బంగారు ఆభరణాలు మాయమయ్యాయని ఓ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. వివరాలిలా ఉన్నాయి. పాప సూర్యనాగేశ్వరరావు అనే వ్యక్తి ఈ నెల 15వ తేదీన దేపల్లిగూడెం నుంచి ఆర్టీసీ బస్సులో భీమవరం వెళ్లాడు. అతనితో పాటు 213 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను తీసుకు వెళ్లాడు. భీమవరంలో బస్సు దిగిన అనంతరం తన వద్ద ఉండాల్సిన బ్యాగ్ కనిపించలేదు. దీంతో భీమవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీను చెప్పారు.

చెరువులో పడి యువతి మృతి

యలమంచిలి: అడవిపాలెం పంచాయతీ గగ్గిపర్రుకు చెందిన బూసారపు వల్లి (17) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై కాకి శివ నారాయణ చెప్పారు. గ్రామంలోని మంచినీటి చెరువు నుంచి నీళ్లు తేవడానికి వల్లి మంగళవారం రాత్రి ఏడు గంటల సమయంలో బకెట్ తీసుకుని వెళ్లింది. ఈ క్రమంలో మెట్టుపై కాలు జారి వెనక్కి పడిపోయింది. దీంతో ఊపిరాడక చనిపోయింది. చెరువుకు వెళ్లిన కూతురు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో తల్లి వెదకగా రాత్రి తొమ్మిది గంటల సమయంలో వల్లి మృతదేహం చెరువులో తేలియాడుతూ కనిపించింది. ఈ మేరకు మృతురాలు వల్లి తల్లి రుక్మిణి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ప్రచారంలో వైఎస్సార్‌సీపీ దూకుడు

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ దూసుకెళుతోంది. ఓ వైపు అభ్యర్థులు ప్రచారం చేస్తుండగా, వారి కుటుంబ సభ్యులు కూడా ప్రచారం నిర్వహిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఇద్దరికీ రెండు ఓట్లు వేసి విజయం చేకూర్చాలని ఓటర్లను కోరుతున్నారు. సీఎం వైఎస్ జగనపాలనలో చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగుతున్నారు.



పాలకొల్లు 12వ వార్డులో మహిళలను ఓట్లు అడుగుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపి

పాలకొల్లు అర్బన్: పేదల బాగు కోసం కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని, వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు 12, 16 వార్డుల్లో బుధవారం గుడాల గోపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. పెద్దలను ఆశీర్వదించాలని కోరారు. విద్య, వైద్య రంగాలకు సీఎం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి వేలాది కోట్లు వ్యయం చేసి పాఠశాలలు, ఆసుపత్రుల రూపురేఖలు మార్చారన్నారు. వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకు పాలన అందుబాటులోకి తీసుకువచ్చిన సీఎం జగన్‌ను మరోసారి సీఎం చేయాలని కోరారు. పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా కృషి చేస్తానన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో ఇంటి స్థలాలు మెరక, పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి ప్రారంభోత్సవం, టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందజేయకుండా ఇలా ప్రతి అభివృద్ధి పనిలో అడ్డుతగిలిన ఎమ్మెల్యే నిమ్మలను ఇంటికి సాగనంపాలని కోరారు. టీటీడీ పాలక మండలి సభ్యులు మేకా శేషుబాబు, వైఎస్సార్ సీపీ చింతలపూడి పరిశీలకులు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, పార్టీ నాయకులు గుణ్ణం సర్వారావు, వీరా శ్రీనివాసరావు, కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, మద్దా చంద్రకళ, కర్రా జయసరిత పాల్గొన్నారు.

ఓట్లు అభ్యర్థించిన మంత్రి కొట్టు తనయుడు



తాడేపల్లిగూడెం 12వ వార్డులో ప్రచారం చేస్తున్న మంత్రి కొట్టు తనయుడు రాజేష్

తాడేపల్లిగూడెం అర్బన్: జగన్ సంక్షేమ పాలన కోరుకునే వారందరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తామని చెబుతున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు రాజేష్ అన్నారు. తాడేపల్లిగూడెం 12వ వార్డులో రాజేష్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన తండ్రి కొట్టు సత్యనారాయణ ఎమ్మెల్యేగా ఉంటేనే తాడేపల్లిగూడెంలో రౌడీయిజం, గుండాయిజం అదుపులో ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ ఓట్లు వేసి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణను గెలపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోరుకునే ప్రతి ఒక్కరూ సార్వత్రిక, పార్లమెంట్ ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ 12వ వార్డు ఇన్‌చార్జి చామన సూర్యచంద్రరావు, కోడే శ్రీను, బోణం విజయనిర్మల ఉన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి



ఎ.పోలవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు

జంగారెడ్డిగూడెం రూరల్: రాష్ట్ర ప్రజలకు మరింత మేలు జరగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి రావాలని చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. మండలంలోని ఎ.పోలవరం, చిన్నవారిగూడెం గ్రామాల్లో బుధవారం విజయరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు హారతులిస్తూ విజయరాజుకి ఘన స్వాగతం పలికారు. ప్రజల వద్దకు వెళ్లి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. విజయరాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చారన్నారు. ముమ్ముందు సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కొనసాగాలంటే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ బుద్దాల సీతారామరాజు, జెడ్పీటీసీ సభ్యులు పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, పార్టీ నాయకులు గురజాల పార్థసారథి, మల్నీడి బాబి, బెజవాడ నాగరాజు, బండారు వెంకట సుబ్బారావు, ముప్పిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారుమూరి గెలుపు కోరుతూ అల్లుడి ప్రచారం



పైడిపర్రులో ప్రచారం చేస్తున్న మంత్రి కారుమూరి అల్లుడు దిలీప్

తణుకు టౌన్: త్వరలో జరిగే సాధారణ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని కోరుతూ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అల్లుడు దిలీప్ బుధవారం సాయంత్రం తణుకు పైడిపర్రు ప్రాంతంలో ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థిచారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికలలో తణుకు ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివ శంకర్, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, నాయకులు కొత్తపల్లి చరణ్, డీ హేమ శ్రీలత, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడులో ఎమ్మెల్యే కుమారుడి ప్రచారం



నూజివీడు 29వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు

నూజివీడు: చంద్రబాబు మాయమాటలు నమ్మి టీడీపీకి ఓటు వేసి కష్టాలు తెచ్చుకోవద్దని వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ నాయకులు, ఎమ్మెల్యే తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) అన్నారు. పట్టణంలోని 29వ వార్డులో బుధవారం రాత్రి ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒకవైపు సంక్షేమ పథకాలతో ప్రజల సంక్షేమానికి, మరోవైపు రాష్ట్ర అభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడ్డారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రతాప్ అప్పారావు వల్లే సాధ్యమవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ తరుపున ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న మేకా వెంకట ప్రతాప్ అప్పారావును, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌లను గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, పార్టీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కోటగిరి పూర్ణిమ, క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు పిళ్లా చరణ్ పాల్గొన్నారు.

రంగనాథరాజు తరపున తనయుడి ప్రచారం



పెనుగొండ అంబేద్కర్‌కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు తనయుడు నరేష్‌రాజు

పెనుగొండ: ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పెనుగొండ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే తనయుడు నరేష్ రాజు అన్నారు. బుధవారం పెనుగొండలోని చెరుకువాడ బైపేవారి పేట, అంబేద్కర్ కాలనీ, కోటిపల్లివారి వీధి, మంగెన వారి వీధిల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమం మరింత జరగాలంటే రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపైనే వేయాలని కోరారు. ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), పంచాయతీ సభ్యురాలు మానుకొండ నీలిమా సునీల్, ఎంపీటీసీలు మద్దింశెట్టి లక్ష్మీ, తాడి సుబ్బిరెడిల్లు, మండల కన్వీనర్లు పలివెల శ్రీను, బాలం సత్తిరాజు, సుంకర నాగబాబు, పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్, పార్టీ నాయకులు గంద్రోతు రాజేష్, పోడూరి రామయ్య పాల్గొన్నారు.

25న గురుకుల ప్రవేశ పరీక్ష

మునునూరు: ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 25న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు, ఏలూరు జిల్లా కన్వీనర్, ముసునూరు బాలికల గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ కొండాబత్తుల ప్రవీణ తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఈ నెల 25న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, 5, 6, 7, 8 తరగతులు, ఏపీఆర్ఎస్ కాట్–2024 విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటలకు వరకు ఏపీఆర్ జేసీ, డీసీ సెట్–2024 విద్యార్థులకు అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్షల హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, పోస్ట్ ద్వారా ఇంటికి పంపడం ఉండదని అభ్యర్థులకు ఆమె సూచించారు.

కూటమివి అన్నీ బూటకపు మాటలే

రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత



సత్తాల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు చెబుతున్న బూటకపు మాటలను ఎవరూ నమ్మవద్దని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని పి.కన్నాపురం, శరభాపురం, సత్తాల, సంద్రకుంట, తక్కెళ్లపాడు, గుణ్ణంపల్లి, మహదేవపురం గ్రామాల్లో ఆమె బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మంత్రి వనితకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు ఆమె పూల మాలలు వేసి, ఘన నివాళులర్పించారు. పి.కన్నాపురంలోని రామాలయాన్ని సందర్శించి, సీతారాములకు పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన ప్రచారంలో ఆమె మాట్లాడుతూ 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఏనాడూ పేదలను పట్టించుకోలేదన్నారు. ఓటమి భయంతో చంద్రబాబు జనసేన, బీజేపీలను కలుపుకుని ప్రజలకు మాయమాటలు చెబుతున్నాడని విమర్శించారు. ఎన్ని పార్టీలు కూటమిగా ఏర్పడినా జగనన్నను ఢీకొట్టే మగాడే లేడని ఆమె గళమెత్తారు. జగనన్న ఐదేళ్ల పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి ట్రైలర్ మాత్రమేనని అన్నారు. భవిష్యత్తులో మరింత సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలన్నారు. పొరపాటున కూటమి అధికారంలోకి వస్తే వారు చేసే అరాచకాలకు అడ్డూ, అదుపు ఉండదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలన్న తపనే తప్ప, ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశం కూటమికి ఏమాత్రం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మన పేదల పార్టీని గెలిపించుకుని, మళ్లీ జగనన్నను సీఎం చేసుకుందామన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, సర్పంచ్‌లు దాసరి సుబ్బలక్ష్మి, కొండాబత్తుల సుభద్ర, పెద్దిన దిలీప్, నున్న పద్మ, కొప్పిశెట్టి గంగ, బొండాడ వెంకన్నబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, మానుకొండ కన్నయ్య, చెరుకూరి ప్రసాదరావు, వామిశెట్టి పరమేశ్వరరావు, ఆచంట సురేష్, కారుమంచి రమేష్, దాసరి రాంబాబు, కుక్కల గట్టియ్య, తోలేటి వెంకట సుబ్బయ్య తదితరులున్నారు.

మేమంతా సిద్ధం సభలతో కూటమి నేతల్లో వణుకు

భీమవరం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం సభలకు పోటెత్తుతున్న జనాన్ని చూస్తుంటే కూటమి నేతల వెన్నుల్లో వణుకు పుడుతోందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. బుధవారం భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి స్వచ్ఛందంగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటే ప్రతిపక్ష పార్టీ నేత చంద్రబాబు జీర్ణించుకోలేక డబ్బులిచ్చి తీసుకువస్తున్నారని చిల్లర జనమంటూ అవాకుచవాకులు పేలడం దుర్మార్గమన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని మంగరాజు స్పష్టం చేశారు.

జగన్ పాలనలోనే బీసీలకు సముచిత స్థానం

తాడేపల్లిగూడెం బీసీల ఆత్మీయ సమావేశంలో వక్తలు



మంత్రి కొట్టు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన కామన రంగబాబు

తాడేపల్లిగూడెం అర్బన్: బీసీలకు రాష్ట్ర స్థాయిలో సముచితస్థానం కల్పించి, బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే మళ్లీ గెలిపిస్తామని బీసీ సంఘాల నాయకులు వెల్లడించారు. ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం బీసీల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం బీసీలను గుర్తించలేదన్నారు. తమకు వేతనాలు పెంచాలని ఒక బీసీ ఉద్యోగి గతంలో టీడీపీ ప్రభుత్వాన్ని కోరితే ఎక్కువగా మాట్లాడితే బీసీల తోకలు కత్తిరిస్తానని చంద్రబాబు నాయుడు అవమానపరిచాడని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలను అవమానించిన టీడీపీకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే బీసీలకు సముచిత స్థానం దక్కిందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఎమ్మెల్సీలు, హోంశాఖ మంత్రి, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి పదవులు ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఉన్నత స్థాయిని కల్పించి బీసీల గౌరవాన్ని పెంచారన్నారు. తాను అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారికి అవసరమైన సేవలు అందిస్తూ వచ్చానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపు సామాజిక వర్గానికి పెద్దపీట వేశారన్నారు. ఉప ముఖ్యమంత్రిగా, దేవదాయ శాఖ మంత్రిగా తనకు రెండు పదవులిచ్చి కాపుల గౌరవాన్ని పెంచారన్నారు. తన వల్ల లబ్ధి పొందిన కొందరు జనసేన పార్టీలో చేరి ఏదో చేస్తారని చెబుతున్నారని వారికి తగిన గుణపాఠం చెబుతానని మంత్రి హెచ్చరించారు. బీసీలు ఉన్నత స్థాయికి ఎదగాలంటే వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని మంత్రి కొట్టు విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్న కామన రంగబాబు

తాడేపల్లిగూడెం మండలం, కొండ్రప్రోలు గ్రామ బీసీ నాయకులు కామన రంగబాబు బుధవారం మంత్రి కొట్టు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. రంగబాబుకు మంత్రి కొట్టు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రంగబాబు గతంలో టీడీపీ బీసీ నాయకునిగా ఉన్నారు. జగన్ సంక్షేమ పాలనకు ఆకర్షితుడినై వైఎస్సార్ సీపీలో చేరానని, పార్టీ గెలుపునకు, మంత్రి కొట్టు సత్యనారాయణ ఎమ్మెల్యేగా గెలిపించేందుకు తనవంతు కృషి చేస్తానని రంగబాబు తెలిపారు. ఎంపీపీ దాసరి హైమావతి, ముద్రగడ లలితకుమారి, గుండబోగుల నాగు, కొలుకులూరి ధర్మరాజు, చిటికన ప్రసాద్, కట్టుబోయిన కృష్ణప్రసాద్, చెన్నా జనార్దన్, గుండుమోగుల బలుసులు, తాతా శ్రీనివాస్, కర్నాటి కన్నయ్య, బీసీ నాయకులు పాల్గొన్నారు.

పీడీ యాక్ట్ కింద నలుగురి అరెస్టు

- రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు
- డీఎస్పీ యు.రవిచంద్ర వెల్లడి



నిందితులు కోడూరి రవితేజ, కోన శ్రీనివాస్ అలియాస్ పెప్పీ నాని, మద్దిపాటి కల్యాణ్, షేక్ నాగూర్ మీరావల్లీ అలియాస్ బబ్లూ

జంగారెడ్డిగూడెం: పదే పదే నేరాలకు పాల్పడుతున్న పట్టణానికి చెందిన నలుగురు నిందితులపై పోలీసులు పీడీ యాక్ట్ అమలు చేశారు. వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. డీఎస్పీ యు.రవిచంద్ర బుధవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జంగారెడ్డిగూడెం పట్టణం, పరిసర గ్రామాల్లో చట్టంపై గౌరవం లేకుండా పదే పదే నేరాలకు పాల్పడుతూ నేరప్రవృత్తిని కలిగి, తీరు మార్చుకోకుండా మళ్లీ నేరాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను గుర్తించామన్నారు. కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు వీరిని ఆంధ్రప్రదేశ్ అక్రమ సారాదారులు, బందిపోట్లు, మాదకద్రవ్యాల నేరస్తులు, గూండాలు, భూఆక్రమణదారులు, డబ్లింగ్ కరెన్సీ తదితర అపాయకర కార్యకలాపాల నిరోధక చట్టం (పీడీ యాక్ట్) కింద వీరిని అరెస్టు చేసినట్లు చెప్పారు. అరెస్టైన వారిలో పట్టణానికి చెందిన కోడూరి రవితేజ (ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురం), కోన శ్రీనివాస్ అలియాస్ పెప్పీ నాని, మద్దిపాటి కల్యాణ్, షేక్ నాగూర్ మీరావల్లీ అలియాస్ బబ్లూ ఉన్నారు. కోడూరి రవితేజపై ఏలూరు, తడికలపూడి, నల్లజర్ల, కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లలో మొత్తం 13 కేసులు, కోన శ్రీనివాస్‌పై జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, ఏలూరు, తడికలపూడి, నల్లజర్ల, కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లలో మొత్తం 9 కేసులు, మద్దిపాటి కల్యాణ్‌పై జంగారెడ్డిగూడెం, తడికలపూడి, నల్లజర్ల, కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లలో మొత్తం 10 కేసులు, షేక్ నాగూర్ మీరావల్లీపై జంగారెడ్డిగూడెం, లక్కవరం, నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌లలో మొత్తం 4 కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ నలుగురితో పాటు మరికొంతమంది కలిసి ఈ ఏడాది ఫిబ్రవరి 21న నల్లజర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 3.5 కేజీల బంగారు ఆభరణాలు, కొంత నగదును ఒక బంగారు వ్యాపారిని అడ్డగించి దోచుకున్నారని డీఎస్పీ వివరించారు. ఈ కేసులో ప్రస్తుతం వీరు ఏలూరు జైలులో రిమాండ్‌లో ఉన్నట్లు తెలిపారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో సీఐ పి.రాజేష్, ఎస్సై పి.జ్యోతిబాస్ పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ యు.రవిచంద్ర

క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



పెట్రోల్ బంకు వద్ద అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అగ్ని ప్రమాదాలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక అగ్నిమాపక కేంద్రాధికారి గణేశ్న వెంకట రామారావు పలు సూచనలు చేశారు. అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా నాలుగో రోజు బుధవారం పట్టణంలోని కేఎన్ రోడ్డులోని పెట్రోల్ బంకులు వద్ద అగ్నిప్రమాదాలు, జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు అందజేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు మంట లను ఏ విధంగా ఆర్పాలో?పలు సూచనలు, డెమోలు సిబ్బంది ద్వారా చూపించారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పోలీస్ ఐలాండ్ చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యాపార వేత్త నంధ్యాల కృష్ణమూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ కృష్ణదేవరాయ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పోలీస్ ఐలాండ్ సమీపంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వ్యాపారవేత్త, సంఘ గౌరవాధ్యక్షుడు నంధ్యాల కృష్ణమూర్తి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జంగా శ్రీనివాస రామరాయ్, ప్రధాన కార్యదర్శి వెజ్జు రామకృష్ణ, కోశాధికారి వట్టిపులుసు దాన వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పిల్లా నరసింహారావు పాల్గొన్నారు.

ఎలక్ట్రో కెమికల్స్ పరికరం ఆవిష్కరణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న నవీన్

భీమవరం: ఆక్వారంగంలో మొబైల్ అప్లికేషన్, ఎలక్ట్రానిక్ అండ్ ఎలక్ట్రో కెమికల్స్ పరికరం విప్లవాత్మక మార్పులకు దోహదం చేస్తుందని యూనోఫీడ్స్ అధినేత తటవర్తి నవీన్ అన్నారు. భీమవరంలో ఆక్వా రైతులకు ఉపయోగపడే ఎలక్ట్రోకెమికల్స్ పరికరం ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆక్వా రైతుల కోసం సలాది గోపీకృష్ణ, వప్పు శ్రీరామ్ కృషితో కౌంట్ 366 సంస్థను స్థాపించి రైతులకు ఉపయుక్తమైన అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్ డివైస్‌లను రైతులకు అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో యిర్రింకి సూర్యారావు, వెంకట్, అమరనేని శ్రీనివాస్, కడలి వెంకటరమణ, బొమ్మిడి సునీల్ కిరణ్‌కుమార్ వీరేంద్ర, కొమ్ముల మురళీకృష్ణ తదితరులుపాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యం పెంపే లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాబు

భీమవరం: ఇంజినీరింగ్ విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే భావవ్యక్తీకరణ, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపర్చుకోడానికి ఇన్ఫినిటో అనే సాంకేతిక, సాంస్కృతిక వేడుకలు నిర్వహిస్తున్నట్టు భీమవరం డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) తెలిపారు. కళాశాలలో బుధవారం బేసిక్ సైన్సెస్ అండ్ హ్యుమానిటీస్ అధర్వ్యంలో ఫస్ట్ ఇయర్ బీటెక్, పాలిటెక్నిక్ విద్యార్థులకు నిర్వహించిన ఇన్ఫినిటో ఫెస్ట్ ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. డీఎన్నార్ కళాశాల విద్యార్థులతోపాటు వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నట్టు చెప్పారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఫెస్ట్ ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు, ప్రిన్సిపాల్ ఎం అంజన్‌కుమార్, జీజీ రత్నం, బీవీఎస్ వర్మ, ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా రాములోరి కల్యాణ సందడి

- గ్రామాల్లో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- రామాలయాల్లో వద్ద భక్తుల కోలాహలం
- కె.పెంటపాడులో ఉపముఖ్యమంత్రి కొట్టు. తేతలిలో మంత్రి కారుమూరి పూజలు



కె. పెంటపాడులో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



శ్రీ వాసవి ఆలయంలో ఆర్యవైశ్యులతో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



చిన్నవంతెన వద్ద కోదండ రామస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం



కె.పెంటపాడు బైరాగిమఠంలో శ్రీరాముని కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీ వాసవి ఆలయంలో శ్రీరామ, సీతాదేవి కల్యాణ మహోత్సవ స్వామి వారు

పెంటపాడు: ప్రజలకు ధర్మబద్దపాలన అందించిన శ్రీరామచంద్రుడు ప్రతీవారికి ఆదర్శం కావాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఆయన శ్రీరామనవమి పురస్కరించుకుని ప్రసిద్ధి చెందిన గోపాలస్వామివారి ఆలయంలో జరిగే శ్రీరామనవమి వేడుకలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడుతూ కె.పెంటపాడులో రెండేళ్ల కింద ఇదే కల్యాణంలో పాల్గొని రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొంది, ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖామంత్రి అయ్యానన్నారు. వచ్చే ఎన్నికలలో అందరి అభిమానంతో కూడా ప్రజలు గెలిపించేలా చూడాలని ఈ సందర్భంగా రాముని కోరుకున్నానన్నారు. ప్రతి ఒక్కరికీ కోర్కెలు నెరవేరాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఈలినాని కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఏటా మాదిరిగా స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. రాజమండ్రికి చెందిన దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఈవీ సుబ్బారావు, తాడేపల్లిగూడెం దేవాలయాల ఇన్‌స్పెక్టర్ సృజన్‌కుమార్, బైరాగిమఠం ఈఓ ఎ.శివశంకర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, కర్రెడ్డి రామకృష్ణ, చెన్నా జనార్ధన్, బర్ల జయరాంబాబు, సర్పంచ్ పీతల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు ఏడుకొండలు, పరిమెళ్ల, పెంటపాడు సర్పంచ్‌లు గొర్రెల కోటేశ్వర రావు, తాడేపల్లి సూర్యకళ, రెడ్డి సూరిబాబు, మిరియాల భాస్కరరావు, దాసి బాబు, దొడ్డిగర్ల చంద్రయ్య పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కోట్లాది నిధుల అందజేత

బైరాగిమఠంలో కల్యాణమండపానికి రూ. 1 కోటి నిధులతో పాటు, ప్రత్యేక డైనింగ్ హాలుకోసం రూ.30 లక్షలు అందించినట్లు మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పెంటపాడులో గౌరీదేవి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ. 1 కోటి, బాల వెంకటేశ్వరస్వామివారికి, అన్నపూర్ణమ్మ అమ్మవారి ఆలయం, మారెమ్మ అమ్మవారి ఆలయం, వల్లూరుపల్లి మందేశ్వరస్వామివారి ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులతో పాటు, పలు ఆలయాలకు దూపదీప నైవేద్యాల కోసం కోట్లాదిరూపాయలు అందించినట్లు తెలిపారు.

కమనీయంగా శ్రీరాముని కల్యాణం

నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన కె. పెంటపాడు బైరాగిమఠంలో శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ఈవో శివశంకర్ ఆధ్వర్యంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు జరిగాయి. కల్యాణం అనంతరం సుమారు 10 వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. త్రిలోచనదాస్, పూర్ణచంద్ర త్రిపాఠి, రామశాస్త్రి తదితరులు కల్యాణం చేయించారు. కల్యాణం అనంతరం పెన్నాడకు చెందిన సన్నాయిమేళం ఆధ్వర్యంలో స్వామివారికి గరుడ వాహన సేవ నిర్వహించారు. పెంటపాడు పాత పంచాయతీ వద్ద నున్న పురాతన శ్రీరామబాలభక్త రామాలయం, కాపులు, వెలమపేట, ఎస్సీపేట, శెట్టిబలిజపేట ప్రాంతాలలోని రామాలయాలు, కె. పెంటపాడు నడిమింటి రామాలయం, బుడగా జంగాల పేట రామాలయం, ప్రత్తిపాడు కోదండ రామాలయం, కొండేపాడు శెట్టిబలిజపేట రామాలయం, మీనవిల్లూరు శ్రీ రామాలయం, అలంపురం, జట్లపాలెం, ఆకుతీగపాడు,విప్పర్రు, యానాలవల్లి, రాచర్ల, వల్లూరుపల్లి, దర్శిపర్రు గ్రామాలోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెంటపాడు రెడ్ల రామాలయంలో 70 వార్షిక సీతారామ కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కర్రి పృధ్వీ కుమార్‌రెడ్డి, సురేఖ దంపతులు కల్యాణంలో పాల్గొని స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొన్ని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, మండల వ్యవసాయ మండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు నల్లమిల్లి గాంధీరెడ్డి, దర్శిపర్రు, ముదునూరు సొసైటీల అధ్యక్షులు గుండుమోగుల సాంబయ్య, బూరాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం పట్టణంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీరామ నవమి సందర్భంగా పట్టణంలోని గొల్లగూడెం పురాతన కోదండ రామాలయంలో బుధవారం స్వామివారికి, అమ్మవారికి వేద పండితులు బ్రహ్మత్వంలో కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. హౌసింగ్‌బోర్డు విద్యుత్ సబ్ స్టేషన్ బాలాంజనేయ స్వామి వారి ఆలయంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది సీతారామస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శాలిపేట రామాలయం, డీఎస్ చెరువు వద్ద కోదండ రామాలయం, ఐదోవ వార్డు పాటోలు వారి వీధిలో శ్రీ శ్రీనివాస రామాలయం, రామారావుపేటలోని నూతనంగా నిర్మించిన రామాలయం, పాతూరులో వినాయకుడి గుడి వద్ద రామాలయం, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం వద్ద రామాలయం, నందిబొమ్మ సెంటర్‌లోని రామాలయంలో టూ టౌన్‌లోని సీతారాంపేట రామాలయం, చిన్న వంతెన వద్ద కోదండ రామస్వామి ఆలయం, వాసవి కన్యకపరమేశ్వరీ ఆలయం రామాలయంలో కనుల పండువుగా స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కోన హనుమాన్‌లు దర్శించారు. కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ సీతారామ స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజల అందరికి అందాలని ఆకాంక్షించారు. 17వ వార్డులో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి వారి ఆలయంలో అంతేగాక ఆంజనేయ స్వామి వారి ఆలయాలు వద్ద సీతారాముల కల్యాణాలు నిర్వహించారు.

తాడేపల్లిగూడెం మండలంలో..

తాడేపల్లిగూడెం రూరల్: శ్రీరామనవమి వేడుకను మండలంలోని ప్రతి గ్రామంలో వాడవాడలా బుధవారం నిర్వహించారు. వెంకట్రామన్నగూడెం, అప్పారావుపేట, మాధవరం, పెదతాడేపల్లి, చిన తాడేపల్లి, జగ్గన్నపేట, కడియద్ద, కృష్ణాయపాలెం, నీలాద్రిపురం, కృష్ణాపురం, ఆరుగొలను, నవాబుపాలెం, పట్టింపాలెం, వీరంపాలెం, బంగారుగూడెం, రామన్నగూడెం, కుంచనపల్లి, దండగర్ర, మెట్ట ఉప్పరగూడెం, జగన్నాథపురం, నందమూరు, ఆరుళ్లతదితర గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయ స్వామివార్ల ఆలయాల వద్ద సీతారాముల కల్యాణాలను జరిపించారు. ఈ సందర్భంగా రాములోరి కల్యాణాలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



వెంకట్రామన్నగూడెం సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



జగన్నాథపురంలో సీతారాముల వారిని దర్శించుకుంటున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

అంగరంగ వైభవంగా కల్యాణోత్సవాలు

తణుకు అర్బన్: శ్రీరామనవమి సందర్భంగా తణుకు పట్టణంలోని రామాలయాల్లో రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ శ్రీరాముడి ఆశీస్సులతో సుఖసంతోషాలతో తులతూగాలని, రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి సీఎంగా రావాలని ఆకాంక్షించారు. ముందుగా రామాలయాలు, అంజనేయస్వామి ఆలయాల్లో మంత్రి కారుమూరికి ఆలయ కమిటీల ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. వేద మంత్రోచ్ఛరణలతో నిర్వహించిన కల్యాణ ఘట్టాల్లో మంత్రి పాల్గొన్నారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, సప్పా బలరామకృష్ణ, కాపు సంఘ అధ్యక్షుడు వంటెద్దు ఈశ్వరప్రసాద్, కుడుపూడి చంద్రరావు, డోలా సింహాద్రి, సప్పా శ్రీనివాస్, పుల్లెపు సూర్యచంద్ర రావు, కోన రమేష్, యడ్లపల్లి సురేంద్ర, రేలంగి రాంబాబు, ఉమ్మిడిసింగ్ శ్రీనివాస్, అడ్డాల రామకృష్ణ, తాటిపర్తి వాసు తదితరులు పాల్గొన్నారు.

తణుకు మండలంలో..

తణుకు టౌన్: శ్రీరామ నవమి వేడుకలను తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో గల శ్రీరామాలయాల్లో బుధవారం కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త తేతలి శివరామ సబ్రహ్మణ్యం మంత్రి కారుమూరిని శాలువాలతో సత్కరించారు. అనంతరం స్వామి వారి కల్యాణం సందర్భంగా పానకాలను భక్తులకు పంపిణీ చేశారు అన్న సమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వర రావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, నాయకులు కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, దారం శ్రీను, కలిదిండి కృష్ణంరాజు, ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీవో హోమ్‌లో...

తణుకు తాలూకా ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు ఆర్ ఎస్ హరనాథ్, పలువురు రాజకీయ, ఉద్యోగ సంఘాల నాయకులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కల్యాణం అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. బొద్దాన్ని తుమ్మన్న దంపతులు శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘం తణుకు తాలూకా అధ్యక్షుడు కెఎస్వీ నరసరాజు, కార్యదర్శి కేవీ సత్యనారాయణ, శ్రీనివాసు, కరుణాకర్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఇరగవరం మండలంలో..

ఇరగవరం: మండలంలోని 21 గ్రామాల్లో శ్రీరామా నవమి వేడుకలు ఘనంగా జరిగాయి ఉదయం నుంచి రామాలయాల్లో భక్తులు స్వామి వారి కల్యాణ వేడుకుల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు, స్వీకరించారు. అనంతరం స్వామి వారి కల్యాణ వేడుకల్లో పానకం స్వీకరించారు.



తణుకు 18వ వార్డులో రామాలయంలో శ్రీరాముడి కల్యాణంలో పాల్గొన్న మంత్రి కారుమూరి



శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న దృశ్యం



తూర్పు విప్పర్రు శివారులో శ్రీరామా నవమి వేడుకల్లో అన్న సమారధాన నిర్వహిస్తున్న దృశ్యం

తూర్పు విప్పర్రు శివారు నారాయణపురంలో భారీగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

అత్తిలి: శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాలనుమండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. అత్తిలి పాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న శ్రీరామాలయంలో సీతారాముల కల్యాణం అల్లబాని జయ శ్రీనివాస్, సాయిలలిత భవానీ దంపతులు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి కృష్ణమాచార్యులు, హనుమత్ సీతారామాచార్యులు పర్యవేక్షణలో కల్యాణోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై సీతారాములను దర్శించుకుని తీర్థప్రసాదాన్ని స్వీకరించారు. అత్తిలి భక్తాంజనేయస్వామి వారి ఆలయంలో చేబ్రోలు భీమేష్ ఆధ్వర్యంలో శ్రీస్వామివారి కల్యాణం జరిపారు. వాడపల్లి సత్యనారాయణాచార్యులు, వల్లీ వెంకటేష్ ఆధ్వర్యంలో కలాణోత్సవ పూజలు చేశారు.

విప్పర్రులో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న యువనేత కొట్టు విశాల్

పెంటపాడు: వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ బుధవారం పడమరవిప్పర్రు గ్రామంలో రామాలయంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పసల కనన సుందర్రావు, బోణం వీరయ్య, కళిరెడ్డి అబ్బాయి, కళిరెడ్డి భూపాల్ పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

ఇట్లు,
ఎమ్. ఎస్. [illegible],
అడ్వకేట్ - తణుకు
తణుకు
తేది.17.04.2024 సెల్ : [illegible]

పీడిత ప్రజల ఆత్మ గౌరవమే విముక్తికి పునాది



సభలో మాట్లాడుతున్న పేరూరి మురళీ కుమార్

తణుకు టౌన్: స్వీయ గౌరవమే పీడిత ప్రజల విముక్తికి పునాది అని చాటిచెప్పిన మహనీయుడు కేజీ సత్యమూర్తి అని బహుజన రచయితల వేదిక వ్యవస్థాపక కార్యదర్శి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నూకతోటి రవికుమార్ చెప్పారు. బుధవారం సాయంత్రం తణుకులోని లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాలులో సామాజిక న్యాయ పోరాట సమితి, బహుజన రచయితల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కేజీ సత్యమూర్తి (శివసాగర్) 12వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సామాజిక న్యాయ పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు గొల్లపల్లి అంబేద్కర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రవి కుమార్ మాట్లాడుతూ సత్యమూర్తి విప్లవ బావజాలంతో పాటు సాహిత్యాన్ని కూడా అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సామాజిక వేత్త డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ సామాజిక విప్లవ పోరాటాలకు శివసాగర్ ఆదర్శనీయుడన్నారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరూరి మురళీకుమార్, రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్, రాష్ట్ర ప్రదాన కార్యదర్శి మేడిపల్లి ఫ్రాన్సిస్, సత్య మూర్తి కంభం సిద్ధార్థ పాల్గొన్నారు.

బైరాగిమఠంలో నేడు దివ్యరథోత్సవం

పెంటపాడు: శ్రీరామనవమి మహోత్సవాలు పురస్కరించుకుని కె. పెంటపాడు బైరాగిమఠంలోని గోపాలస్వామివారి ఆలయంలో గురువారం స్వామివార్లకు దివ్యరథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎ.శివశంకర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం ప్రత్యేక పూజలు, తులసీదళ సహస్రనామార్చనలు, నిత్యహోమాలు, సాయంత్రం 4 గంటలకు కుంభహారతి, ప్రత్యేకంగా పూలతో అలంకరించిన భారీ రథంలో స్వామివార్ల గ్రామోత్సవం, పెన్నాడ, చివటం బుట్టబొమ్మల ప్రదర్శన, సన్నాయి మేళం, రాత్రి మిలట్రీ మాధవరం వేదాల సుబ్బారావు ఆధ్వర్యంలో పౌరాణిక నాటకాలైన వెరైటీ చింతామణి, సత్య హరిశ్చంద్ర కాటిసీన్‌ల ప్రదర్శన ఉంటుందని స్పష్టం చేశారు.

కుమ్మర శాలివాహన సంఘం ఆత్మీయ సమావేశం



తణుకులో మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం

తణుకు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలోని కుమ్మర శాలివాహనులు సుమారు రూ. 1680 కోట్లకుపైగా వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందారని కుమ్మర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం అన్నారు. బుధవారం తణుకులోని బీసీ సంఘ భవనంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పురుషోత్తం పాల్గొని మాట్లాడారు. జిల్లా శాలివాహన వెల్ఫేర్ కమిటీ సభ్యులు బిరుదుకోట చింతన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఐ.నాగేంద్ర, వెల్ల వెంకటేశ్వరరావు, కోనాల మల్లిఖార్జునరావు, లాంగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం: దివ్యాంగులంతా కలిసి ప్రగతి సాధించాలని, ఒకరికొకరు సహకరించుకొని ముందుకు సాగాలని ఏపీ పీహెచ్‌సీ జేఏసీ గౌరవాధ్యక్షుడు దిడ్ల సురేష్ సూచించారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీహాల్లో నిర్వహించిన భీమవరం దివ్యాంగుల సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా కోరాడ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కొండ్రు అప్పారావు, మహిళా అధ్యక్షురాలిగా దాయం మరియమ్మ, ప్రధాన సలహాదారునిగా మద్దాల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా నిమ్మల సింహాచలం, మీడియా కన్వీనర్‌గా పోతుల బాలు ఎన్నికయ్యారు.